క్లుప్తంగా

ఘనంగా తిరు కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం తిరుకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ అలివేలుమంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు.అనంతరం సోలిపేట అమరేందర్‌రెడ్డి కుటుంబీకులు భక్తులకు అన్నప్రసాదం అందించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం రూ.5.59 లక్షలు



తైబజార్ వేలంలో గ్రామస్తులు, అధికారులు

కందుకూరు: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే తైబజార్‌ను వేలంలో గ్రామానికే చెందిన కొమ్మగళ్ల యాదగిరి రూ.5,59,010 లకు దక్కించుకున్నాడు. శుక్రవారం కందుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత ఆధ్వర్యంలో తైబజార్‌కు వేలం నిర్వహించారు. వేలంలో యాదగిరి ప్రథమ స్థానంలో నిలిచి కైవసం చేసుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు అతను తైబజార్‌ను నిర్వహించుకోవచ్చు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.సురేందర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోండి



ఆకులమైలారంలో వైద్య శిబిరం

కందుకూరు: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని ఆకులమైలారం మాజీ సర్పంచ్ గొరిగె కలమ్మ కోరారు. శుక్రవారం గ్రామంలో హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. కాగా శిబిరంలో వైద్యులు శ్వేత, సుష్మకుమారి, అశోక్, రాజు, మధుర తదితరులు పాల్గొని 185 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచులు గొరిగె రాజు, రాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూపాల్ గౌడ్‌కు సన్మానం



భూపాల్ గౌడ్‌ను సన్మానిస్తున్న విశ్వనాథ్ గౌడ్

పహాడీషరీఫ్: బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పంతంగి రాజు భూపాల్ గౌడ్‌కు బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్‌తో కలిసి భూపాల్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు.

నెలల తరబడి.. వృథాగా నీరు



తుక్కుగూడ ఔటర్ జంక్షన్ వద్ద వృథాగా పోతున్న నీరు

తుక్కుగూడ: అసలే వేసవి కాలం.. భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. మంచి నీళ్ల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కానీ తుక్కుగూడ పురపాలికలోని ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్–14 సర్వీస్ రోడ్డులో హెచ్‌ఎండబ్ల్యూఎస్ మంచినీరు సరఫరా చేసే ఎయిర్ వాల్వ్ మరమ్మతులకు గురైంది. దీంతో నీరంతా వృథాగా పోతోంది. నెలల తరబడి ఇలానే ఉన్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎయిర్ వాల్వ్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మురుగు.. పరుగు

- అస్తవ్యస్తంగా మురుగునీటి పారుదల
- అవుట్‌లెట్స్ లేక అపార్ట్‌మెంట్లలోనే నిలుస్తున్న వ్యర్థజలాలు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



ఓ అపార్ట్‌మెంట్ ఎదుట ప్రవహిస్తున్న మురుగునీరు

హుడాకాంప్లెక్స్: అధికారుల నిర్లక్ష్యం.. అస్తవ్యస్తమైన నిర్వహణతో కాలువల్లో పారాల్సిన మురుగునీరు, అపార్ట్‌మెంట్ సెల్లార్లలో పారుతోంది. వీధి చివర్లో ఉన్న ఔట్‌లెట్స్‌ను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో.. పై కాలనీల నుంచి వచ్చే మురుగు జలాలు సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఈస్ట్‌ను ముంచెత్తుతోంది.

తక్కువ సామర్థ్యం ఉన్న పైపులైన్లు

1990లో అప్పటి ప్రభుత్వం 25 ఎకరాల విస్తీర్ణంలో 48 అపార్ట్‌మెంట్లు నిర్మించింది. ఒక్కో అపార్ట్‌మెంట్‌లో 50 ఫ్లాట్లు చొప్పున ఉంటాయి. ఒక్కో ఇంట్లో సగటున నలుగురు చొప్పున నివసిస్తున్నారు. అప్పటి జనాభా నిష్పత్తికి అనుగుణంగా డ్రైనేజీ కాల్వలను నిర్మించారు. ప్రస్తుతం సమీప కాలనీల్లో వెలసిన నివాసాల నుంచి కూడా మురుగునీరు వచ్చి ఇక్కడి జంక్షన్‌లో కలిసిపోతోంది. ఈ నీరు సులభంగా కిందికి వెళ్లే సామర్థ్యం ఉన్న లైన్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఈ మురుగు వీధుల్లో పొంగుతోంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా లైన్లు వేస్తే కాలనీ సమస్య పరిష్కారం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఆ మేరకు అంచనాలు రూపొందించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

మూడు నెలలుగా అదే ప్రవాహం

మూడు నెలలుగా అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న మ్యాన్‌హోల్ నుంచి బయటికి వస్తున్న మురుగు నీరు తీవ్రమైన దుర్గంధాన్ని వ్యాప్తి చేస్తోంది. స్థానికుల ముక్కుపుటాలను అదరగొడుతోంది. కళ్ల ముందే మురుగునీరు ఏరులై పారుతున్నా కనీసం అటువైపు ఎవరూ చూడటం లేదు. సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరుతూ ఇటు జీహెచ్‌ఎంసీ, అటు స్థానిక ప్రజాప్రతినిధులను కోరినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. పైగా మరింత అధ్వానంగా తయారైంది.



అపార్ట్‌మెంట్ లోపల నిలిచిన మురుగు

దోమలతో అస్వస్థత



డ్రైనేజీ నుంచి వస్తున్న కలుషితనీరు తీవ్రమైన దుర్వాసనను వ్యాప్తి చేస్తోంది. ముక్కుపుటాలు అదురుతున్నాయి. అంతేకాదు దోమలు, ఈగలు నిల్వ ఉండి అస్వస్థతకు కారణమవుతున్నాయి. రోడ్లపై నిల్వ ఉంటుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా టూవీలర్లపై ప్రయాణించే వారు జారి కిందపడుతున్నారు.

– శివనాగేశ్వర్‌రావు, స్థానికుడు

‘ఆశ’ల సమస్యలు పరిష్కరించండి

- సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజ్



వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమయిందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలన్నారు. అర్హులైన ఆశ వర్కర్లను ఏఎన్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని, పని భారాన్ని తగ్గించాలని కోరారు. వారి సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24న సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్యురాలికి అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు శ్రీలత, రజిత, మంజుల, అప్రోచ్, ముంతాజ్‌బేగం, సురేఖ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



భక్తులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న సచ్చిదానంద సరస్వతి మహాస్వామి

మీర్‌పేట: మీర్‌పేట ఓల్డ్ గాయత్రినగర్‌లోని శ్రీ శారదా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం కలశపూజ, పూర్వాంగ అభిషేకంతో పాటు శ్రీ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి బ్రహ్మ కలశాభిషేక మహాపూజ, మహా మంగళహారతి, రథశుద్ధి, రథబలి పూజలు చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య రథారోహణోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలోఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, అర్చకులు దీక్షితులు, సత్యనారాయ ణరెడ్డి, కిషోర్‌రెడ్డి, నాయకుడు నర్సింహరెడ్డి పాల్గొన్నారు.



షాహిన్‌నగర్‌లో మిఠాయి విక్రయాలు

పసందైన మీఠా

- రంజాన్ మాసంలో ప్రత్యేకంగా స్వీట్లు
- ఆరగిస్తున్న తీపి ప్రియులు

పహాడీషరీఫ్: రంజాన్ మాసంలో తీపి వంటకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రతిరోజు ఇఫ్తార్ సమయంలో ముస్లింలు హలీం ఆరగించిన అనంతరం సంప్రదాయంగా తమకిష్టమైన ఈ తీపి పదార్థాలను తీసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఘుమఘుమలాడే హలీం లాంటి వంటకాలకు పోటీగా ఈ తీపి పదార్థాల క్రయ విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎర్రకుంట, షాహిన్‌నగర్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఈ మిఠాయి విక్రయ కేంద్రాలకు భలే గిరాకీ ఉంటోంది. ఈ నోరూరించే తీపి పదార్థాలలో ప్రధానమైన బాదం ఫిర్నీ, ఖుర్బానీ కా మీఠా, ఖద్దూ కా కీర్, ఫ్రూట్ సలాడ్, డబుల్ కా మీఠా, ప్యారమిల్, కర్జూర్ హషీద్‌లకు డిమాండ్ ఉంది. తీపి పదార్థాలను చిన్న చిన్న మట్టి కుండలతో పాటు ప్లాస్టిక్ డబ్బాలలో ఏర్పాటు చేసి ప్రధాన రహదారులపై విక్రయిస్తున్నారు.

బాక్స్ రూ.30ల నుంచి రూ.300 వరకు

కేవలం రంజాన్ మాసంలోనే లభ్యమయ్యే ఈ మిఠాయిల ధరలు ప్రతి ఒక్కరికి అందుబాటులోనే ఉన్నాయి. ఒక్కో బాక్స్ ధర రూ. 30ల నుంచి మొదలు కొని రూ.300 ల వరకు పలుకుతుంది. ఇందులో ప్లేట్, ఫ్యామిలీ ప్యాక్ తదితర సైజ్‌లలో ఈ మీఠా బాక్స్‌లను విక్రయిస్తున్నారు. ప్రతి రోజు ఒక్కో మిఠాయి నిర్వాహకుడు 100 నుంచి 200ల వరకు ఈ మిఠాయి బాక్స్‌లను విక్రయిస్తున్నారు.

మట్టి కుండలలో భలే రుచి

వీటిలో ప్రధానమైన బాదం ఫిర్నీని మట్టి కుండలలో ఉంచుతారు. లిక్విడ్‌గా ఉండే ఈ మిఠాయిని కుండలో వేయడంతో గట్టి పడడంతో పాటు రుచి కూడా మారిపోతుంది. ఈ మిఠాయిని కేవలం మట్టి కుండలోనే తింటేనే రుచిగా ఉంటుందని మిఠాయి ప్రియులు పేర్కొంటున్నారు. మట్టి కుండలలో మంచినీరు, మజ్జిగలు ఎలా ఉంటాయో ఈ బాదం ఫిర్నీ కూడా అంతే రుచిగా ఉంటుంది.

తయారు చేసే విధానం

ఖుర్బానీ కా మీఠాను తయారు చేసేందుకు చక్కెర, రెడ్ కలర్, ఖుబానీ క్రీమ్(డ్రై ఫ్రూట్స్), రస్‌బరీ షర్బత్ అవసరం. దీనిని తయారు చేసేందుకు దాదాపు రెండు గంటల సమయం పడుతుంది. ముందుగా ఖుర్బానీని మంచినీటితో శుభ్రం చేసిన అనంతరం నీళ్లలో ఉడకబెట్టాలి. దీని నుంచి లోపల ఉన్న గింజలను తొలగించాలి. తర్వాత చక్కెర వేసి ఉడకబెట్టాలి. చివరకు రస్‌బరీ షర్బత్, కలర్ వేయాలి. దానిని చల్లబరిచేందుకు పాత్ర చుట్టూ ఐస్‌ను ఉంచాలి.

తొలి రోజు ‘పది’ పరీక్షలు ప్రశాంతం

- మహేశ్వరంలో నలుగురు, బాలాపూర్ మండలంలో 16 మంది గైర్హాజరు



మహేశ్వరం: మండల కేంద్రం ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

మహేశ్వరం: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు. మండలంలోని మొత్తం 9 పరీక్ష కేంద్రాల్లో 1,304 మందికి 1300 మంది పరీక్ష రాశారు. నలుగురు గైర్హాజరయ్యారని ఎంఈఓ కస్న నాయక్ తెలిపారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట/బడంగ్‌పేట్: బాలాపూర్ మండల పరిధి 20 పరీక్ష కేంద్రాల్లో 4,052 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, మొదటి రోజు 4,036 మంది హాజరు కాగా, 16 మంది గైర్హాజరయ్యారని విద్యాధికారి కృష్ణయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాలను వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగరాజులు తనిఖీ చేశారు.

కందుకూరులో..

కందుకూరు: కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాల, నోబుల్ హైస్కూల్, నేదునూరు మోడల్ స్కూల్‌లోని రెండు కేంద్రాలతో మొత్తం నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 778 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారని ఎంఈఓ నరసింహ తెలిపారు. సీఐ సీతారామ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



మీర్‌పేట: పరీక్ష కేంద్రం వద్ద ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగరాజు



కందుకూరు: సెంటర్ వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ తదితరులు



కందుకూరు: హాల్ టికెట్ నంబర్ సరిచూసుకుంటున్న విద్యార్థులు

ఆక్రమణలు తొలగించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో రోడ్డును ఆక్రమించి కొనసాగిస్తున్న వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగార్జున కోరారు. ఈ మేరకు శుక్రవారం బీజేవైఎం నాయకులు జల్‌పల్లి కమిషనర్ వెంకట్రామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ... ఇరుకుగా ఉన్న శ్రీరాం కాలనీ రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఈ కారణంగా రోడ్డు కుంచించుకు పోయి ట్రాఫిక్ స్తంభిస్తుందన్నారు. కొందరు ఇళ్ల యజమానులు కూడా రోడ్డుపైకి మెట్లు నిర్మించుకున్నారన్నారు. ఇలాంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, సుమిత్, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్టా చట్టాన్ని సవరించాలి



కేఎల్లార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రిగ్గు ఓనర్స్ సభ్యులు

తుక్కుగూడ: వాల్టా చట్టాన్ని సవరించి, బోర్ బండి యజమానుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రిగ్గు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను పురపరిధి పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. వాల్టా చట్టం సవరణ అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బోర్ బండిలో మ్యాన్ పవర్ లేకుండా ఆటోమేటిక్‌గా రింగు నడిచే యంత్రాన్ని తమ సంస్థలో తయారు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంజిరెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంను ‘ఫ్యూచర్’లో కలపాలి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలి
- ఎమ్మెల్యే సబితారెడ్డి
- విలీనం చేసేవరకు పోరాటం: జేఏసీ



ఎమ్మెల్యే సబితారెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

మహేశ్వరం: ఎన్నికలకు ముందు మహేశ్వరంను మహానగరంగా తీర్చిదిద్దుతామని, ఫ్యూచర్ సిటీగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారని ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. ఇప్పుడు ఫ్యూచరే లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై సరైన ప్రణాళిక లేకుండా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని కొన్ని గ్రామాలనే ఫ్యూచర్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించి.. మిగతా గ్రామాలను కలపకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు, మెహబ్బత్‌నగర్ గ్రామాలను విలీనం చేసిందని, మిగతా గ్రామాలను కలిపే వరకు ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కల్పిస్తే ఇదే అంశంపై మాట్లాడతానని తెలిపారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, మాజీ సర్పంచ్ ఆనందం, మోతీలాల్ నాయక్, శివగంగ, ఆలయ మాజీ చైర్మన్లు ఎం.నవీన్, సుధీర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమారిరాయప్ప పలువురు పాల్గొన్నారు.

విలీనం చేసేవరకు ఉద్యమిస్తాం

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు ఉద్యమిస్తామని మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి అన్నారు. శుక్రవారం మండల పరిధి అమీర్‌పేట్‌లోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి.. మహేశ్వరాన్ని మహానగరంగా మారుస్తామని, ఫ్యూచర్ సిటీ చేస్తామని హామీనిచ్చి, విస్మరించారని ఆరోపించారు. ఫ్యూచర్‌లో మండలంలోని రెండు గ్రామాలు తుమ్మలూరు, మెహబ్బత్‌నగర్‌ను విలీనం చేసి, మిగతా 28 జీపీలను కలపలేదన్నారు. శనివారం నుంచి ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కలిసి సమస్యలను వివరిస్తామని పేర్కొన్నారు. ఇదే విషయమై.. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను కలుస్తామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మనోహర్, జేఏసీ నాయకులు మల్లేశ్ యాదవ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, నందిగామ నర్సింహ, అంద్యా నాయక్, కడారి జంగయ్య యాదవ్, హస్నగళ్ల చంద్రయ్య, యాదగిరి గౌడ్, ఎద్మ మోహన్‌రెడ్డి, దత్తు నాయక్, రవి నాయక్, ఆవుల యాదయ్య ఉన్నారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాన్ని సంఘం నాయకులతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం ఇచ్చే రోజు కూలీ రూ.300 నుంచి రూ.800లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమి లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్‌కార్డులను ఇచ్చి పని కల్పించాలన్నారు. ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తి విఫలం అయ్యిందని ఆరోపించారు. పని ప్రదేశాల్లో మంచి నీరు, టెంట్లు, వైద్య సదుపాయం ఏర్పాటు చేయడం లేదన్నారు. కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పని ప్రదేశానికి విచ్చేసిన ఏపీఓ అరుణకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కూలీలు లాలయ్య, పెంటయ్య, అంజయ్య, కృష్ణయ్య, యాదమ్మ, అలివేలు, పవన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.